జిమ్ పనులు పూర్తి చేయాలని వినతి



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తూ..

అల్వాల్: వెంకటాపురం డివిజన్ ఇందిరానగర్ వీకర్ సెక్షన్ కానాజిగూడలోని వ్యాయామశాల పనులను పూర్తి చేయాలని కార్పొరేటర్ సబితఅనికిషోర్‌గౌడ్, స్థానికులతో కలిసి సోమవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా అవసరమైన వ్యాయామ సామగ్రి సమకూర్చాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డోలి రమేష్, సంపత్, మోసిన్, అనంత్, రాజేష్, సురేష్, శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

హరీష్‌రావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావుకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఆయన నివాసంలో కలిసిన వారు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, గుండారపు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు



మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వెంకటేశ్వర దేవస్థానం హుండీ లెక్కింపు సోమవారం దేవాదాయశాఖ అధికారి డి.రవికుమార్ పర్యవేక్షణలో జరిగింది. 80 రోజుల హుండీ లెక్కింపు ద్వారా సుమారు రూ.4,35,885 ఆదాయం వచ్చిందని దేవస్థానం ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపులో అర్చకులు ముదుంబై వేంకటరమణాచార్యులు, తులసి రమణాచార్యులు, వేణుగోపాలచార్యులు, క్లర్క్ సుధాకర్, దేవస్థానం మాజీ చైర్మన్లు ఉమేష్‌సింగ్, సంతోష్ ముదిరాజ్, మాజీ ధర్మకర్తలు రవీందర్, రత్నాకర్, ఆలాపన తదితర భక్తులు పాల్గొన్నారు.

బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ప్రదీప్‌కుమార్



అల్వాల్: బీజేపీ మేడ్చల్–మల్కాజిగిరి అర్బన్ జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎం.ప్రదీప్‌కుమార్ నియమితులయ్యారు. బీజేపీ అర్బన్ జిల్లా కన్వీనర్ ఎస్.మల్లారెడ్డి చేతులమీదుగా సోమవారం ఆయన నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పార్టీ కార్యక్రమాల్లో మరింత చురుగ్గా పాల్గొంటూ, పార్టీ విస్తరణకు కృషి చేస్తానన్నారు.

జిల్లా కార్యవర్గ సభ్యుడిగా గణేష్



అల్వాల్: బీజేపీ మేడ్చల్–మల్కాజిగిరి అర్బన్ జిల్లా కార్యవర్గ సభ్యులుగా డి.గణేష్ నియమితులయ్యారు. సోమవారం బీజేపీ అర్బన్ జిల్లా కన్వీనర్ ఎస్.మల్లారెడ్డి చేతులమీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్–మల్కాజిగిరిలో జిల్లాలో పార్టీ విస్తరణకు కృషి చేస్తానన్నారు.

14రోజుల పాటు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

పీర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు



మేడిపల్లి: పీర్జాదిగూడ నగరపాలక పరిధిలో 14రోజుల పాటు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించామని పీర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో 26వార్డుల్లోని వీధుల్లో శానిటేషన్ కార్యక్రమాలు, మొక్కలకు పెంచేందుకు పాదులు తీయడం, పిచ్చిమొక్కలను తొలగించడం, మ్యాన్‌హోల్స్ రిపేర్ చేయించడం, సీసీ రోడ్డు ప్యాచ్ వర్కులు, వీధి దీపాల నిర్వాహణ, నాలాల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించడం, ఖాళీ ప్లాట్లలోని చెత్తను తొలగించడం వంటివి నిర్వహించినట్లు ఆయన తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా వేస్తామని తెలిపారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు.

పార్టీ పదవుల్లో ఉద్యమకారులకు ప్రాధాన్యం

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



సంపత్‌కుమార్ జన్మదినోత్సవాల్లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

రామంతాపూర్: తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు ఉప్పల్ నియోజకర్గ సీనియర్ బీఆర్ఎస్ నేత రామంతాపూర్‌కు చెందిన తిప్పని సంపత్‌కుమార్ జన్మదిన వేడుకలకు సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కేక్ కట్ చేసి సంపత్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమకారుడైన సంపత్ పార్టీ అభివృద్ధి కోసం అంకిత భావంతో పని చేసిన నేత అని కొనియాడారు. పార్టీ పదవుల్లో మలిదశ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకే ప్రాధాన్యం ఇస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు మహ్మద్ ముస్తాక్, వెంకటేష్‌చారి, రవి, యాదగిరిరెడ్డి, లక్ష్మమ్మ, మురళి, మల్లేశం, సైదులు, మేస్త్రీ తదితరులు పాల్గొన్నారు.

అందరి దృష్టి ఫలితాలపైనే



పట్నం సునీత మహేందర్‌రెడ్డి | ఈటల రాజేందర్ | రాగిడి లక్ష్మారెడ్డి

- మరి కొన్ని గంటల్లో వీడనున్న ఉత్కంఠ
- 'మల్కాజిగిరి' తమదే అంటూ ఫైపైకి ధీమా
- పోలైన ఓట్లపై ఎవరి లెక్కలు వారివే..

ఉప్పల్: మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ మరికొన్ని గంటల్లో వీడనుంది. గెలుపుపై ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. తామే గెలుస్తామంటూ పైకి గంభీరంగా కనిపిస్తున్నా లోలోన మాత్రం నరాలు తెగే ఉత్కంఠతో ఉన్నారు. ఈ గెలుపు బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్, బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డి ముగ్గురికీ ప్రతిష్ఠాత్మకమే. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవగానే అంతకు ముందు బీఆర్ఎస్‌లో మంత్రిగా ఉన్న పట్నం మహేందర్‌రెడ్డి సతీసమేతంగా కాంగ్రెస్ పార్టీలో చేరి మల్కాజిగిరి టికెట్‌ను తన భార్య సునీత మహేందర్‌రెడ్డికి ఇప్పించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశించిన రాగిడి లక్ష్మారెడ్డి సైతం టికెట్ దక్కకపోవడంతో కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా తనవంతుగా కృషిచేసి బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకున్నాడు. ప్రస్తుతం బీఆర్ఎస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. తాను భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయం అంటున్నారు. పార్లమెంట్ నియోజకవర్గంలో ఏడుకు ఏడు నియోజకవర్గాల్లో పార్టీ ఎమ్మెల్యేలు ఉండటంతో తామే భారీ మెజార్టీతో గెలుస్తామని బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో పాటు బీఆర్ఎస్ శ్రేణులు అంటున్నారు. ఇక బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా హుజురాబాద్ నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన ఈటల రాజేందర్ మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్రమోదీ హవా ఉండటంతో తన గెలుపు సునాయసమే అని అంటున్నారు. ఈటల గెలుస్తారని బీజేపీ శ్రేణులు సైతం సంతోషంలో ఉన్నారు. ఉప్పల్ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే పట్నం సునీతమహేందర్‌రెడ్డిని గెలిపించాలని, ఆమెకు ఓటు వేస్తే నాకు వేసినట్లే అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారంలో ప్రకటించడంతో తామే గెలుస్తామంటూ కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా ఉన్నారు. ఏది ఏమైనా మరికొన్ని గంటల్లో ఉత్కంఠకు తెర పడనుంది. 2019లో మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో వివిధ పార్టీలకు ఉప్పల్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో వచ్చిన ఓట్లు ఇలా ఉన్నాయి.

- కాంగ్రెస్ అభ్యర్థి ఎనుముల రేవంత్‌రెడ్డికి 85,385
- టీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డికి 77,501
- బీజేపీ అభ్యర్థి రామ్‌చందర్‌రావుకు 46,143

2023 ఉప్పల్ అసెంబ్లీ ఎన్నికల్లో వివిధ పార్టీలకు వచ్చిన ఓట్లు..

- మొత్తం పోలైన ఓట్లు 2,73,226
- బీజేపీ అభ్యర్థి ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌కు 47,332
- కాంగ్రెస్ అభ్యర్థి మందుముల పరమేశ్వర్‌రెడ్డి 83,397
- బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి 1,32,927.

2024 పార్లమెంట్ ఎన్నికల్లో..

మొత్తం ఓట్లు	5,40,052
పోలైన ఓటు	2,61,634
పురుషులు	1,35,338,
మహిళలు	1,26,285,
ఇతరులు	11.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- 20 టేబుల్స్, 21 రౌండ్స్
- 60 మంది అధికారులు, సిబ్బంది
- ఉత్కంఠలో పార్టీ నాయకులు



మల్కాజిగిరి నియోజకవర్గం మ్యాప్

మల్కాజిగిరి: మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గం ఈవీఎంల కౌంటింగ్‌కు కీసర హోలీమేరీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. నియోజకవర్గం పరిధిలో మొత్తం 418 పోలింగ్ స్టేషన్ల ఓట్ల లెక్కింపు కోసం 20 టేబుల్స్‌ను ఏర్పాటు చేశారు. మొత్తం కౌంటింగ్ 21 రౌండ్లలో పూర్తవుతుంది. ప్రతి టేబుల్‌కు సూపర్‌వైజర్, మైక్రో అబ్జర్వర్, సహాయకుడు అందుబాటులో ఉంటారు. కౌంటింగ్ ప్రక్రియను నియోజకవర్గం సహాయ రిటర్నింగ్ అధికారి రవికిరణ్ పర్యవేక్షణలో జరగనుంది. నియోజకవర్గంలో మొత్తం 5,08,048 మంది ఓటర్లు ఉండగా 2,64,019 ఓట్లు (51.97 శాతం) ఓట్లు పోలయ్యాయి. ఎప్పటికప్పుడు రౌండ్ వారిగా ఫలితాలను ప్రకటించేందుకు అవసరమైన సిబ్బందిని నియమించడమే కాకుండా మీడియా పాయింట్‌ను ఏర్పాటు చేశారు.

నాయకుల్లో ఉత్కంఠ..

మరి కొన్ని గంటల్లో ఫలితం తేలనుండటంతో అన్ని రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే బూత్‌ల వారిగా పోలైన ఓట్లతో లెక్కలు చేసిన నాయకులు గెలుపు మాదే అన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వచ్చిన ఎగ్జిట్ పోల్ సర్వేల్లో వచ్చిన వివరాలతో పైకి గుంబనంగా కనిపిస్తున్నా లోలోన ఆందోళనకు గురవుతున్నామని పార్టీ నాయకులు తెలిపారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు



ఘట్‌కేసర్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన వైస్ చైర్మన్ మాధవరెడ్డి

ఘట్‌కేసర్ : బీఆర్ఎస్ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ వైస్ చైర్మన్ హాజరై జాతీయ జెండాను, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, రమాదేవి, ఆంజనేయులుగౌడ్, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ ధర్మారెడ్డి, మాజీ చైర్మన్ సార శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు గోపాల్‌రెడ్డి, నర్సింగ్‌రావు, మహిళా అధ్యక్షురాలు అండాలు, అన్ను, కృప, మురళీగౌడ్, రాజు, విజయ్, ఖలీల్, పాషా, శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆశ్రమంలో..

శామీర్‌పేట్ : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు సోమవారం పండ్లు పంపిణీ చేశారు. మూడుచింతలపల్లి మండలం, జగ్గంగూడ గ్రామంలోని దివ్యాంగుల ఆశ్రమంలో మూడుచింతలపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అనిల్‌రెడ్డి పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

విత్తనాల దుకాణాల్లో తనిఖీలు



ఘట్‌కేసర్: పట్టణంలోని ఎరువులు, విత్తనాల దుకాణాన్ని మండల వ్యవసాయాధికారి బాసిత్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువులు, విత్తనాల స్టాక్ రిజిస్టర్, తయారీ తేదీ, గడువు తేదీ, విత్తన ప్యాకెట్లను పరిశీలించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువుల డూప్లికేట్ రసీదులను పరిశీలించారు. నిబంధనలు పాటించని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బేకరీలో అధికారుల తనిఖీలు..

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పట్టణంలోని మ్యాక్స్ బేకరీలో సోమవారం మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పాడైన బ్రెడ్ అమ్ముతున్నారని స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో మున్సిపల్ ఏఈ నాగేశ్వర్‌రెడ్డి, సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. పాడైన బ్రెడ్, ఆహార పదార్థాలను అధికారులు తనిఖీల్లో గుర్తించారు. ఈ మేరకు బేకరీపై చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

మల్కాజిగిరిలో బీజేపీ విజయం ఖాయం

బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు హనుమాన్



ఘట్‌కేసర్: మల్కాజగిరి ఎంపీగా బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్, ముచ్చటగా మూడోసారి నరేంద్రమోదీ ప్రధాని అయ్యేది ఖాయమని బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు విప్పర్ల హనుమాన్ అన్నారు. ఘట్‌కేసర్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధితో పాటు దేశరక్షణకు బీజేపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలకు ముగ్ధులయ్యారని అభిప్రాయపడ్డారు. నేడు ఎన్నికల ఫలితాల లెక్కింపు సందర్భంగా వీక్షించేందుకు పట్టణంలో సామూహికంగా స్క్రీన్లు ఏర్పాటు చేశామని, ఉదయం 10 గంటల వరకు పార్టీ శ్రేణులు ఆంధ్రాబ్యాంకు వద్దకు చేరుకోవాలని కోరారు.

క్రెడిట్ కార్డు మోసాలతో బీకేర్‌ఫుల్

- లోన్ కోసం బ్యాంకుకు వెళ్తే వెలుగు చూసిన మోసం
- కంగుతిన్న కల్నల్

కుషాయిగూడ: బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం ఓ అధికారిని కంగు తినిపించింది. ఆయన పాన్ కార్డును జతచేసి మరో వ్యక్తికి క్రెడిట్ కార్డు మంజూరీ చేసి సదరు అధికారిని డిఫాల్టర్‌గా మార్చేసి అవమానపరిచారు. ఆయనకు అత్యవసరమై లోన్ కోసం బ్యాంకుకు వెళ్లగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. కాప్రా, శాంతివిహార్ కాలనీ, గ్రీన్‌పార్క్ ఎన్‌క్లేవ్‌కు చెందిన లెఫ్టినెంట్ కల్నల్ ఎంఎస్ రాజు(74) 2021లో డిఫెన్స్ కాలనీలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు లోన్ కోసం సంప్రదించి దరఖాస్తు చేసుకున్నాడు. బ్యాంకు అధికారులు కల్నల్ లోన్ దరఖాస్తును తిరస్కరించారు. తన దరఖాస్తును ఎందుకు తిరస్కరించారంటూ కల్నల్ బ్యాంకు అధికారులను ప్రశ్నించగా మీకు సంబంధించి ఎస్‌బీఐ, అమెరికన్ ఎక్స్‌ప్రెస్ బ్యాంకు, సెంట్రల్ బ్యాంకుల క్రెడిట్ కార్డులకు సంబంధించిన బిల్ రూ.46,757 చెల్లించకుండా డిఫాల్టర్‌గా ఉండటం కారణంగా లోన్ దరఖాస్తును తిరస్కరించినట్లు తెలిపారు. దీంతో కల్నల్ కంగుతిన్నాడు. అయితే ఆయన ఇప్పటి వరకు క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోలేదు. ఎలాంటి క్రెడిట్ కార్డులు తీసుకోలేదు. తనకు జరిగిన మోసంపై ఆయా బ్యాంకులకు మెయిల్‌లో ఫిర్యాదు చేశారు. పలుమార్లు మెయిల్ చేసినా బ్యాంకుల నుంచి ఎలాంటి రిప్లై రాకపోవడంతో ఆర్‌బీఐని ఆశ్రయించాడు. తనకు జరిగిన మోసంపై ఆర్‌బీఐకి ఫిర్యాదు చేశాడు. స్పందించిన ఆర్‌బీఐ అధికారులు సదరు క్రెడిట్ కార్డులు కె.ఎస్.ఎన్.రాజుకు సంబంధించినవిగా తేల్చింది. బ్యాంకు అధికారులు తమవల్ల జరిగిన తప్పిదానికి క్షమాపణలు కోరి కల్నల్ సిబిల్ స్కోర్‌ను సవరించి లోన్ క్లియర్ చేశారు. ఇది ఇలా ఉండగా కల్నల్ తనకు జరిగిన అన్యాయంపై కోర్టును ఆశ్రయించి తనను డిఫాల్టర్ అంటూ బ్యాంకు అధికారులు తన పరువుకు భంగం కలిగించారని మల్కాజిగిరి కోర్టును ఆశ్రయించాడు. విచారించిన మేజిస్ట్రేట్ కల్నల్‌కు జరిగిన పరువు నష్టంపై కేసు నమోదు చేయాలంటూ కుషాయిగూడ పోలీసులను ఆదేశించారు. కోర్టు ఆదేశాల మేరకు 2023లో కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసి సంబంధిత బ్యాంకులకు నోటీసులు జారీ చేశారు. పోలీసుల నోటీసులపై బ్యాంకు అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన కోర్టు కేసు విచారణను ఇంతటితో నిలిపివేయాలంటూ పోలీసులను ఆదేశిస్తూ తీర్పునిచ్చింది. దీంతో పోలీసులు చార్జిషీట్ వేయకుండా కేసు విచారణను నిలిపివేశారు. ఇలాంటి ఘటనలు తరచూ ఏదో ఓ చోట చేసుకుంటున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవశ్యకత ఉంది. అందుకు కల్నల్‌కు జరిగిన మోసమే ఓ ఉదాహరణ.

వానాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పలువురు కార్పొరేటర్లతో వానాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కార్పొరేషన్‌లోని పలు సమస్యలపై సోమవారం సమీక్ష నిర్వహించారు. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలను తీసుకోవాలని, ఈదురు గాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని, నిరంతరం సరఫరా చేయాలని, తాగునీరు రోజు విడిచి రోజు సరఫరా అయ్యేలా చూడాలని, మున్సిపల్ అధికారులు డివిజన్లలో పర్యటించి సమస్యలకు చెక్ పెట్టాలని, వరద నీరు సాఫీగా వెళ్లేందుకు మ్యాన్‌హోల్స్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని కార్పొరేటర్లు, అధికారులకు డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్ సూచించారు. విద్యుత్ అధికారులు, వాటర్ బోర్డు అధికారులు, రెవెన్యూ సిబ్బంది, టౌన్ ప్లానింగ్ అధికారులు, మేనేజర్ జ్యోతి, పలువురు కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు హాజరయ్యారు.

ఎస్సీ హాస్టల్‌లో ప్రవేశాలు ప్రారంభం

మేడ్చల్ : మేడ్చల్ పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఎస్సీ హాస్టల్‌లో ప్రవేశాలు ప్రారంభిస్తున్నట్లు ఎస్సీ వెల్ఫేర్ అధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు. మూడోతరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు ప్రవేశాలు అందుబాటులో ఉన్నాయని, 100 మంది విద్యార్థులకు వసతి కల్పించనున్నట్లు వివరించారు. అడ్మిషన్ల కోసం కులం, ఆదాయం సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, బోనాఫైడ్, పాస్‌ఫోటోలు, బ్యాంకు అకౌంట్ వివరాలు సమర్పించాలని, పూర్తి వివరాలకు హాస్టల్‌కు రావాలని సూచించారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



కీసర: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లికి చెందిన జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 1998–1999 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి ఆంజనేయులు కుటుంబానికి స్నేహితులు అండగా నిలిచారు. మృతుడి పిల్లల చదువు కోసం సోమవారం రూ.లక్ష ఆర్థికసాయాన్ని అతడి కుటుంబసభ్యులకు అందజేసి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

భర్త వేధిస్తున్నాడని..

భార్య ఫిర్యాదుతో అదృశ్యం



రామలింగయ్య (ఫైల్)

జవహర్‌నగర్: భర్త వేధిస్తున్నాడని భార్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. భర్త అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కౌకూర్ సుజిత్ గ్రీన్‌గోల్స్ ఎన్‌క్లేవ్–బి బ్లాక్‌లో నివసించే నూతలపాటి రామలింగయ్య (55), భార్య లక్ష్మి, కుమార్తెతో కలిసి ఉంటున్నారు. రామలింగయ్య రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి. కాగా వారి కుమార్తె చెన్నైలో ఉద్యోగం చేస్తుంది. మద్యానికి అలవాటుపడిన అతడు భార్యను రోజూ వేధిస్తుండేవాడు. ఈ క్రమంలో భార్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయం తెలుసుకున్న భర్త గత నెల 31న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

హాస్టల్‌లో చోరీ

సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను ఎత్తుకెళ్లిన దుండగులు

పోచారం : గుర్తుతెలియని వ్యక్తులు ఓ హాస్టల్‌లో చొరబడి ల్యాప్‌టాప్‌లు, ఫోన్లు చోరీ చేసిన ఘటన పోచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. యంనంపేట్‌లోని అలేఖ్య బాలుర హాస్టల్‌లో స్థానిక శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన హరీష్‌రెడ్డి, సాయికిరణ్ రవీంద్రనాయక్, ఇన్ఫోసిస్ ఉద్యోగి మారుతి ఉంటున్నారు. మే 30న రాత్రి 11 గంటల తర్వాత ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు సెల్ఫ్‌లో పెట్టి పడుకున్నారు. ఉదయం నిద్రలేచి చూస్తే 6 ల్యాప్‌టాప్‌లు, 2 సెల్‌ఫోన్లు కనిపించలేదు. దీంతో బాధితులు పోచారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



నాగారం ప్రభుత్వపాఠశాలను పరిశీలిస్తున్న నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు కృషి చేయనున్నట్లు నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. ఈనెల 12 నుంచి ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం నాగారం మున్సిపాలిటీలోని ప్రభుత్వపాఠశాలలను ఆయన సందర్శించారు. పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా తరగతిగదులు, పాఠశాల ఆవరణను శుభ్రపరిచి, తాగునీరు తదితర సౌకర్యాలను విద్యార్థులకు అనుగుణంగా తయారుచేసేందుకు మున్సిపల్ నుంచి కావాల్సిన సహాయసహకారాలు అందించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని వివిధ కాలనీల్లో నివసించే ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆయన కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పుస్తకాలు, నోట్‌బుక్స్, మధ్యాహ్న భోజనం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్, మేనేజర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయిల్లో నిలవడం అభినందనీయం



దల్లాస్‌లో నిర్వహించిన గ్లోబల్ అల్యూమి మీట్‌లో ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు

మేడ్చల్‌రూరల్ : సీఎంఆర్, మల్లారెడ్డి గ్రూప్స్ విద్యాసంస్థల్లో విద్యాభ్యాసం చేసి వివిధ దేశాల్లో ఉన్నత స్థానాల్లో నిలవడం ఎంతో అభినందనీయమని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. అమెరికాలోని దల్లాస్‌లో 'సీఎంఆర్ అండ్ మల్లారెడ్డి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్' ఆధ్వర్యంలో గ్లోబల్ అల్యూమి మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మల్లారెడ్డి, సీఎంఆర్ గ్రూప్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ సంస్థల్లో చదివిన విద్యార్థులు విదేశాల్లో ఉన్నత స్థాయిలో ఉండటం సంతోషంగా ఉందన్నారు. ఉన్నత విద్యను అభ్యసించేందుకు విదేశాలకు వచ్చిన విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించి భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దుకోవాని సూచించారు. మల్లారెడ్డి యూనివర్సిటీ వీసీ వీఎస్‌కేరెడ్డి, మల్లారెడ్డి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కీసరగుట్టకు పోటెత్తిన భక్తులు



ఆలయంలో భక్తుల రద్దీ



స్వామివారికి ప్రత్యేక పూజలు..

కీసర: రాష్ట్ర రాజధానికి చేరువలో ఉన్న కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. శివుడికి ఇష్టమైన రోజు సోమవారం కావడంతో పాటు, పాఠశాల, కళాశాల విద్యార్థులకు సెలవులు ఉండటంతో కీసరగుట్టస్వామివారి దర్శనం కోసం కుటుంబసమేతంగా భక్తులు తరలివచ్చారు. గర్భాలయంలో కొలువైన శ్రీరామలింగేశ్వరుడిని దర్శించుకున్న అనంతరం ఆలయ పరిసర ప్రాంతాల్లో కుటుంబసమేతంగా కొద్దిసేపు గడిపి తిరుగుపయనం అయ్యారు. కాగా సోమవారం సందర్భంగా స్వామివారికి వేదపండితులు ఉదయం మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, వంశపారంపర్య ధర్మకర్తలు రమేష్, నారాయణ, వెంకటేష్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.